క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రంను మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య సోమవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో మెప్మా కార్యాలయ సిబ్బందితో పాటు కార్యాలయం వద్దకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా మాధవరావును మెప్మా సిబ్బంది సత్కరించారు.

కేజీ పొగాకు ధర రూ.280

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట వద్ద గల ఒంగోలు–1 పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు ధర రూ.280 పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 207 బేళ్లను వేలానికి ఉంచగా, 134 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 73 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ కనిష్ట ధర రూ.260, సరాసరి ధర రూ.274.95 పలికింది. వేలంలో మొత్తం 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఒంగోలు సిటీ: నూతన ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకుంటే అడియాశలు అయ్యాయని పలు సంఘాల నాయకులు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉగాది కానుకగా పెండింగ్ డీఏలు, ఐఆర్ వెంటనే ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు ఈనెలాఖరులోపు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సేవలను రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించుకుంటూ వారి సమస్యల పరిష్కారంలో సాచివేత వైఖరి అవలంబించటం తగదన్నారు. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తద్వారా పేద, మధ్య తరగతి ప్రజల బిడ్డలకు న్యాయం చేయాలన్నారు. ఎన్నికలప్పుడు అధికారం కోసం, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై చేసిన వాగ్దానాలను అమలు చేయాలని ఏపీటీఎఫ్, ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ, ఫ్యాప్టో, ఏపీజేఏసీ సంఘాల నాయకులు కె.వి.జి.కీర్తి, వై.శ్రీనివాసులు, బి.వెంకటరావు, ఎ.అమ్మయ్య, బి.అశోక్ కుమార్, యం.రాఘవరావు, పి.వి.సుబ్బారావు డిమాండ్ చేశారు.

అనాథల సేవ గొప్ప విషయం



ఆర్థిక సహాయం చేస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు దంపతులు

ఒంగోలు మెట్రో: అనాథలకు సేవ చేయడం గొప్ప విషయమని కొత్తపట్నం మండల తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు అన్నారు. ఒంగోలులోని సంతపేట షిరిడీ సాయిబాబా మందిరం దగ్గర గల శివ శరణాలయంలో సోమవారం ఉదయం అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శరణాలయంలో దంపతి సమేతంగా పూజా క్రతువులు నిర్వహించారు. శరణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి తహసీల్దార్ దంపతులను సత్కరించి అభినందనలు తెలిపారు. శరణాలయంలోని వృద్ధులకు, నగరంలోని 300 మంది అనాథ యాచకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం



మద్దిపాడు బీ సెంటర్‌లో వసతులను పరిశీలిస్తున్న జిల్లా అబ్జర్వర్ సుబ్బారెడ్డి, డీఈఓ కిరణ్‌కుమార్



సంతనూతలపాడు హైస్కూల్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు: పదో తరగతి పరీక్షలు సంతనూతలపాడు మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 1023 మంది విద్యార్థులకుగానూ 1014 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. సంతనూతలపాడు హైస్కూల్లో 230 మంది విద్యార్థులకుగానూ 228 మంది హాజరవగా, ఏపీ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 215 మంది విద్యార్థులకుగానూ 214 మంది హాజరయ్యారు. పేర్నమిట్టలోని గురుదత్త హైస్కూల్లో 200 మంది విద్యార్థులకుగానూ 198 మంది, శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల సెంటర్లో 180 మంది విద్యార్థులకుగానూ 179 మంది, పీర్లమాన్యం పరిధిలోని క్విజ్ హైస్కూల్లో 198 మంది విద్యార్థులకుగానూ 195 మంది పరీక్షలకు హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సంతనూతలపాడులోని ఏపీ గురుకుల పాఠశాల, హైస్కూల్ కేంద్రాల వద్ద సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మద్దిపాడులో పరిశీలించిన డీఈఓ, జిల్లా అబ్జర్వర్...

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మద్దిపాడు ఏ సెంటర్‌లో 220 మందికిగానూ 216 మంది హాజరయ్యారు. బీ సెంటర్‌లో 140 మందికిగానూ 138 మంది హాజరయ్యారు. సీ సెంటర్‌లో 179 మందికిగానూ 178 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద తల్లిదండ్రుల హడావిడి నెలకొంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్ష కేంద్రాల వద్దకు ఉదయమే చేరుకుని తమ పిల్లలు పరీక్ష రాసేంత వరకూ కేంద్రాల బయటే ఉండి ఎదురు చూశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా విద్యాశాఖ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించారు. పరీక్ష ముగిసేంత వరకూ ఆయా గ్రామాల్లో జెరాక్స్ సెంటర్‌లు తీయకుండా మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) నుంచి జిల్లా అబ్జర్వర్ సుబ్బారెడ్డి, డీఈఓ కిరణ్ కుమార్ పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

కొత్తపట్నం మండలంలో పది మంది గైర్హాజరు...

కొత్తపట్నం: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొత్తపట్నం ఏ, బీ సెంటర్లు, ఈతముక్కల సీ సెంటర్‌లో కలుపుకుని 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 640 మంది హాజరయ్యారు. కొత్తపట్నం హైస్కూల్లో నలుగురు విద్యార్థులు, ఈతముక్కల హైస్కూల్లో ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్పందన శూన్యం..!

- స్పందన కార్యక్రమానికి అధికారుల గైర్హాజరు
- అసహనం వ్యక్తం చేస్తున్న అర్జీదారులు



సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో హాజరైన అధికారులు

సంతనూతలపాడు: స్పందన కార్యక్రమానికి సోమవారం మండలంలోని పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కొన్ని వారాలుగా అధికారులు గైర్హాజరవుతున్నప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి తహసీల్దారు వేమూరి ఆదిలక్ష్మి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు మాత్రమే హాజరవుతున్నారు. ఇతర శాఖల అధికారుల్లో కొందరే వస్తున్నారు. కొన్నిశాఖల అధికారులు తరచూ గైర్హాజవుతున్నారు. కలెక్టర్, జేసీ, ఇతర జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన కార్యక్రమంపై సమీక్షిస్తున్నప్పటికీ మండల స్థాయి అధికారులు పలువురు డుమ్మాకొడుతున్నారు. అన్ని శాఖల మండల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉండగా, కొందరు హాజరుకాకపోవడంతో ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమాన్ని మండల పరిషత్ ఏవో ఈదర విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతీబాయ్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు మాత్రమే హాజరయ్యారు. ఇతర అధికారులెవరూ రాకపోవడంతో అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. అన్ని శాఖల మండల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు లాప్‌టాప్‌ల పంపిణీ



విభిన్న ప్రతిభావంతులకు లాప్‌టాప్‌లు అందజేస్తున్న కలెక్టర్

ఒంగోలు సిటీ: జిల్లాలో రెగ్యులర్‌గా చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సెస్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా సోమవారం గ్రీవెన్స్ హాలులో 23 లాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. 14 మందికి కృత్రిమ కాళ్లు అందజేశారు. జేసీ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ చినఓబులేసు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించాలి

- ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీడీ వెంకటస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సోషల్ ఆడిట్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంతనూతలపాడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ రంగాల్లో వెచ్చించిన 8 కోట్ల 16 లక్షల 53 వేల 135 రూపాయలకు సంబంధించిన పనుల రికార్డులు, పనుల నిర్వహణపై గ్రామాల వారీగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందంతో పాటు ఉపాధి హామీ పథకం సంతనూతలపాడు నియోజకవర్గ ఏపీడీ పాలేటి వెంకటస్వామి, సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్షించారు. మండలంలోని 18 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందం చేసిన తనిఖీలపై సమీక్షించారు. నాలుగు కోట్ల 34 లక్షల 43 వేల 147 రూపాయలను వివిధ పనుల నిమిత్తం ఉపాధి కూలీలకు వేతనాల కింద చెల్లించగా, మిగిలిన నిధులను గ్రామాల వారీగా పలు రంగాల అభ్యున్నతికి వినియోగించారని అధికారులు తెలిపారు. గ్రామాల వారీగా జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు, పనులు జరిగిన ప్రదేశాలను సోషల్ ఆడిట్ బృందానికి తెలియజేయాలని ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఏపీడీ వెంకటస్వామి ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ బృందానికి సహకరించాలని, లేనిపక్షంలో నూరు శాతం రికవరీ చేస్తామని చెప్పారు. వర్క్ ఫైలు, ఎంబుక్, పంచాయతీ తీర్మానాలు, ఎస్టిమేట్లు, శాంక్షన్, తదితరాలు తప్పనిసరిగా ఉండాలని ఏపీడీ తెలిపారు. రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవన్నారు. పదిమంది ఎస్‌ఆర్పీ, డీఆర్పీ, వీఎస్‌ఏ బృందం గ్రామాల్లో పనులను తనిఖీ చేస్తారని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఈ నెల 29వ తేదీ సంతనూతలపాడులో మండల స్థాయిలో ప్రజావేదిక జరగనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. సమావేశంలో సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, మండల డ్వామా ఏపీవో వాసంతి, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, ఎస్‌ఆర్పీ మూర్తి, ఈసీ బాబు, టీఏలు, ఎఫ్‌ఏలు, సోషల్ ఆడిట్ బృందం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం



సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు

కొత్తపట్నం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి గడ్డం మురహరిరావు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. తమకు రావాల్సిన డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాటి సొమ్ము తీసుకోకుండానే మరణించేలా ఉన్నామన్నారు. గత పీఆర్‌సీలో తగ్గించిన అడిషనల్ క్యాంటమ్ ఆఫ్ పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 సంవత్సముల వారికి 10 శాతం, 75 సంవత్సరాల వారికి 15 శాతం పునరుద్ధరణ చేసివ్వాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై వైద్యం చేయమని హాస్పిటల్ సిబ్బంది చెబుతున్నారని, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌పై వైద్యం చేయించుకోమంటున్నారని తెలిపారు. ఆర్థిక వెసులుబాటు లేక సరైన వైద్యం చేయించుకోలేక మరణిస్తున్నారని డీటీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తగు చర్యలు తీసుకుని ఈహెచ్‌ఎస్ కార్డులపై క్యాష్‌లెస్ వైద్యం పూర్తి స్థాయిలో అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.కోటేశ్వరరావు, ఎం.ఏసుదాస్, శర్మ, శ్రీహరి, మీనాక్షి, వెంకాయమ్మ, తిరుపతమ్మ, లక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూ దురాక్రమణ నుంచి కాపాడండి



నాయుడు శివరాం ప్రసాద్



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి

ఒంగోలు వన్‌టౌన్: భూ దురాక్రమణ నుంచి కాపాడాలని కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన నాయుడు శివరాం ప్రసాద్ అనే 60 ఏళ్ల వృద్ధుడు మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి 11.95 సెంట్లు అని రెవెన్యూ రికార్డుల్లో కూడా తమ పేర్లే ఉన్నాయన్నారు. అయితే ఇదే ప్రాంతానికి చెందిన పిన్ని నాగేశ్వరరావు, చాపల స్వాములు, నాయుడు వెంకటేశ్వర్లు, నాయుడు వెంకట్రావు, రాసాని శివయ్య, నాయుడు గిరి స్వాములు, నాయుడు శ్రీను, చాపల శ్రీను, శింగోతు జాలయ్య, అనే వారు 3.40 సెంట్లను ఆక్రమించి తమను పొలంలోకి రాకుండా అడ్డుపడుతున్నారన్నారు. ఇదే విషయమై కోర్టులో కేసు కూడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. గతంలో రెండు సార్లు కలెక్టర్‌కు, ఒకసారి ఎస్పీ గ్రీవెన్సుకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం శూన్యం. మళ్లీ ఇప్పుడు వచ్చి అర్జీ ఇస్తే ఆర్డీఓను కలవండని సూచించారని వాపోతున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారు

ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ ఫైలు మీద చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ విడుదల చేయకుండా మాటలతో కాలం గడుపుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం సమర్పించారు. అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, అల్లూరి జిల్లాలకు పోస్టుల విషయంలో అన్యాయం జరిగిందని, తగినంతగా పోస్టులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు ఇచ్చేంత వరకు కనీసం నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాల వివాదంపై సర్వే

చీమకుర్తి రూరల్: విజయవాడ – బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మండల పరిధిలోని పల్లామల్లిలో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించడంపై శనివారం గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ వివాదంపై సోమవారం రెవెన్యూ అధికారులు పల్లామల్లి గ్రామ సర్వే నంబర్ 33/2లో హైవే నిర్మాణ సంస్థకు చెంది గ్రావెల్ తవ్వకాలకు అనుమతులున్న నాలుగు హెక్టార్లను కొలిచి హద్దులు వేశారు. నిర్ణయించిన హద్దుల లోపల మాత్రమే గ్రావెల్ తవ్వకాలు జరపాలని, హద్దులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని రెవెన్యూ అధికారులు తెలిపారు. సర్వేయర్ రాజేష్, వీఆర్‌ఓ అనిత, గ్రామ సర్వేయర్ సతీష్ పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు

క్షౌరవృత్తిదారులకు ప్రభుత్వ స్థలం కేటాయించాలి



ఈఓఆర్‌డీ రమణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

సంతనూతలపాడు: క్షౌరవృత్తిదారులకు సంతనూతలపాడులో ప్రస్తుతం వారుంటున్న దుకాణాల స్థలాలను కేటాయించి లీజుకివ్వాలని కోరుతూ సోమవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. సంతనూతలపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి గుడి వద్ద ఉత్తరం దిక్కుగా ఉన్న ఖాళీ స్థలంలో గత 17 సంవత్సరాలుగా నాయీబ్రాహ్మణులు క్షౌ రవృత్తితో జీవనం సాగిస్తున్నారని నాయీబ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ కరేటి నరసింహారావు తెలిపారు. కానీ, ఆ స్థలాలు ఖాళీ చేయాలని, లేకపోతే పెట్రోల్ పోసి తగలబెడతామని సంతనూతలపాడుకు చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య అనే వ్యక్తి గత 10 రోజులుగా నాయీబ్రాహ్మణులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా స్థానికంగా ఉంటున్నవారిని ఖాళీ చేయించి మరొకరికి లీజుకు ఇవ్వద్దని, ఆ స్థలాలను నాయీబ్రాహ్మణులకే కేటాయించాలని కోరుతూ సోమవారం ఒంగోలులో స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంతనూతలపాడు ఈఓఆర్‌డీ ఎ.రమణమ్మను సంతనూతలపాడులో కలిసి సమస్య వివరించారు. కార్యక్రమంలో క్షౌ రశాలల మండల అధ్యక్షుడు గుంటూరు రమేష్, జనరల్ సెక్రటరీ పచ్చవ వెంకట సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, ఏల్చూరి వెంకట శేషయ్య, గుంటూరు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రనరసింహస్వామి

త్రిపురాంతకం: మండలం పరిధిలోని గుట్ట ఉమ్మడివరంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఉగ్రనరసింహస్వామి 21వ తిరునాళ్ల మహోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు వడ్డమాని ఆత్మానందకుమార శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ధ్వజారోహనం, స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఉదయం విష్వక్షణ ఆరాధన, పుణ్యావచనం, గణపతి పూజ, నవగ్రహ పూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన, సుదర్శన హోమం, శ్రీలక్ష్మి గణపతి హోమం, వాస్తు హోమం, శ్రీరుద్ర హోమం, పూర్ణాహుతి పూజలు, బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల వద్ద లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సామూహిక 108 మంది దంపతులచే స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి విద్యుత్ కాంతులతో ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

నక్కల గిరిజనుల మెరుపు ధర్నా

ఒంగోలు టౌన్:

నక్కల గిరిజనులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ సోమవారం రాత్రి 8 గంటలకు గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, నక్కల గిరిజన సంక్షేమ సంఘ నాయకురాలు నక్కల రాణమ్మ, గిరిజన ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం నాయకత్వంలో సుమారు 50 మంది నక్కల గిరిజనులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమకు ఇళ్లు కట్టించి ఇచ్చేంత వరకు ప్రతిరోజూ రాత్రి కలెక్టర్ గేట్ వద్దనే పడుకుంటామని చెప్పారు.

డీఎస్ మహిళా డిగ్రీ కళాశాలకు 'ఏ' గ్రేడ్



అధ్యాపకుల పనితీరును పరిశీలిస్తున్న ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కుసుమకుమారి

ఒంగోలు సిటీ: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు 'ఏ' గ్రేడ్‌ను కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి మార్గదర్శకాలను అనుసరించి ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కల్యాణి సోమవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో విద్యా సంబంధిత అంశాలపై అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. అకడమిక్ అధికారులుగా బాపట్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు షేక్ అబ్దుల్ కలాం, కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ కె.సుజాత వ్యవహరించారు. వారు కళాశాలలో డిజిటల్ తరగతి గదులు, సెమినార్ హాలు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమ కుమారి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పి.ఇందిర, డాక్టర్ ఎ.వి.రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అకడమిక్ ఆడిట్ ఫలితంగా కళాశాలకు 'ఏ' గ్రేడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.